క్లుప్తంగా

సీఐగా బాధ్యతల స్వీకరణ



గోవిందరావుపేట: పస్రా సీఐగా రవీందర్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. పస్రాలో పనిచేసిన సీఐ శంకర్ జిల్లా కేంద్రానికి బదిలీ కావడంతో ఆయన స్థానంలో రవీందర్‌ను నియమించారు. బాధ్యతలు స్వీకరించిన సీఐకి పోలీస్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఎస్పీని కలిసిన సీఐ రవీందర్

ములుగు: గోవిందరావుపేట మండలం పస్రా పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్(సీఐ)గా బాధ్యతలు స్వీకరించిన రవీందర్ మంగళవారం జిల్లాకేంద్రంలో ఎస్పీ డాక్టర్ శబరీశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడాలని సూచించారు. కాగా, పస్రా పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తూ సీఐగా ప్రమోషన్ పొందిన రవీందర్ బదిలీలో సీసీఎస్ సీఐగా జిల్లా కేంద్రానికి వచ్చారు. తదనంతరం అదే స్టేషన్‌కు సీఐగా బదిలీ అయ్యారు.

వైద్యాధికారికి సన్మానం



మంగపేట: మండలంలోని బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కారం నిఖిల్‌కుమార్‌ను ఆశ కార్యకర్తలు మంగళవారం ఘనంగా సన్మానించారు. అనంతరం పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తల సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏఎన్‌ఎంలు, సూపర్‌వైజర్, ల్యాబ్ టెక్నీషియన్లు తదితరులు ఉన్నారు.

పరామర్శ



ములుగు రూరల్: మండలంలోని దేవగిరిపట్నం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు కొమ్మిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని గ్రంథాలయ మాజీ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ మంగళవారం పరామర్శించారు. శ్రీనివాస్‌రెడ్డి మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డి, స్థానిక నాయకులు ఉన్నారు.

నేటి నుంచి విద్యుత్ సరఫరా నిలిపివేత

కన్నాయిగూడెం: ఏటూరునాగారం నుంచి కన్నాయిగూడెం వరకు ఉన్న విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంతో నేడు(బుధవారం) నుంచి శుక్రవారం వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ములుగు విద్యుత్ డీఈ నాగేశ్వర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

'కావాలనే సస్పెండ్ చేస్తున్నారు'



ములుగు: అనవసరమైన కారణాలను చూపుతూ జిల్లా అటవీశాఖ అధికారి(డీఎఫ్‌ఓ) తనను సస్పెండ్ చేస్తున్నారని బంగ్లావాచ్ ఉమెన్ గట్టి గొప్పుల భాగ్యలక్ష్మి ఆరోపించారు. జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో మంగళవారం 'సాక్షి'తో తన గోడును వెలిబుచ్చారు. 2004లో తాను మంగపేట మండలంలోని అటవీశాఖ రేంజ్ కార్యాలయంలో బంగ్లావాచ్ ఉమెన్‌గా విధుల్లోకి చేరానని అన్నారు. జిల్లా ఏర్పాటు తరువాత ములుగు రేంజ్ కార్యాలయ వాచ్ ఉమెన్‌గా విధులు నిర్వహిస్తున్నానని అన్నారు. అయితే డీఎఫ్‌ఓ రాహుల్‌కిషన్ జాదవ్ ఆదేశాలతో విధులను పక్కనబెట్టి డీఎఫ్‌ఓ ఇంట్లో పనిచేయడానికి ఒప్పుకున్నానని అన్నారు. గత ఏడాది దసరా పండుగ సందర్భంగా మూడు రోజులు అనుమతి కోరుతూ సెలవు తీసుకున్నానని డీఫ్‌ఓ కాల్‌చేసి విధులకు రావాలని ఆదేశాలు జారీ చేశారని అన్నారు. సెలవు తీసుకున్నాని చెప్పినా వినకుండా అనుమతి లేకుండా విధులకు హాజరుకాలేదనే కారణంతో సస్పెండ్ చేశారని అన్నారు. రెండవ సారి జూన్ 02న తన కొడుకు హనుమాన్ మాల విరమించుకోవడంతో సెలవు తీసుకున్నానని, దీంతో విధులకు హాజరు కాలేదనే కారణంతో రెండవ సారి సస్పెండ్ చేశారని ఆరోపించారు. డీఎఫ్‌ఓ చెప్పినట్లు వింటేనే విధులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నారని, లేని పక్షంలో మెమోలు జారీ చేస్తూ మనస్తాపానికి గురి చేస్తున్నారని వాపోయారు. ఈ విషయంపై డీఎఫ్‌ఓతో ఫోన్‌లో మాట్లాడేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. రేంజ్ అధికారి శంకర్‌ను వివరణ కోరగా బంగ్లా వాచ్ ఉమెన్ డీఎఫ్‌ఓ ఇంట్లో పనిచేయాల్సిన అవరసరం లేదని అన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

ఏటూరునాగారం: గ్రామాల శుభ్రతపై ప్రత్యేక దృష్టి చూపుతున్నట్లు ఎంపీడీఓ రాజ్యలక్ష్మి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలో ఉన్న చెత్త చెదారం, రోడ్ల వెంట ఉన్న మట్టిని తొలగించారు. ప్రతి ఇంటి వద్ద చెత్తాడబ్బాలను ఏర్పాటు చేసుకొని గ్రామ పంచాయతీ ట్రాక్టర్ వచ్చినప్పుడు అందులో వేయాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ కుమార్, కార్యదర్శి రమాదేవి, సిబ్బంది రవీందర్, వెంకన్న, లక్ష్మీనారాయణ, దయాకర్ పాల్గొన్నారు.

ప్రజల రక్షణే లక్ష్యం

ములుగు: పట్టణంలోని ప్రజల రక్షణే గ్రామ పంచాయతీ లక్ష్యం అని ఈఓ పెంట రఘు అన్నారు. మంగళవారం గ్రామ పంచాయతీ సిబ్బంది పలు కాలనీల్లో పేరుకపోయిన చెత్తాచెదారం, వ్యర్థాలను తొలగించారు. కాలనీల్లో పెరిగిన పిచ్చిమొక్కలను గ్రాస్ కటింగ్ ద్వారా శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ.. ఖాళీ ప్రదేశాల్లో మురుగునీరు నిల్వలేకుండా చూసుకోవాలని అన్నారు. ప్లాట్లలో నీరునిల్వ ఉంటే రూ.10వేల జరిమానా విధించబడుతుందని హెచ్చరించారు. ఈగలు, దోమలు వ్యాప్తి చెందకుండా గ్రామ పంచాయతీ తరుపున చర్యలు తీసుకుంటామన్నారు.

వాజేడు: శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు, ఎస్సై రుద్రారపు హరీశ్, పంచాయతీల కార్యదర్శులు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు. పిచ్చి చెట్లను, పొదలను తొలగించారు. రహదారికి ఇరువైపులా ఉన్న పొదలను తీసేశారు. మురుగు గుంతల్లో ఆయిల్ బాల్స్‌ను వేశారు. రహదారుల వెంట బ్లీచింగ్ చల్లించారు.



వాజేడు: డ్రైయినేజీ శుభ్రం చేస్తున్న పంచాయతీ సిబ్బంది

ఎదిర వైద్యశాలలో..

వెంకటాపురం(కె): మండల పరిధిలోని ఎదిర ప్రభుత్వ వైద్యశాలలో మంగళవారం వైద్యశాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యశాలలోని చెత్త చెదారాన్ని, పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం ఎదిర ఆరోగ్య మహిళ కేంద్రంలో వైద్యాధికారి భవ్యశ్రీ 92 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. 26 మంది వద్ద నుంచి శాంపిల్స్‌ను సేకరించి వైద్య పరీక్షలకు ములుగు ఏరియా వైద్యశాలకు పంపించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

వెంకటాపురం(కె) పంచాయతీలో..

వెంకటాపురం మేజర్ పంచాయతీలో కార్మికులు పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించారు. మండల కేంద్రంలోని చిడెం వారి వీధిలో రోడ్డుకు పక్కన పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించడంతో పాటుగా చెత్త చెదారాన్ని తొలగించారు.

పీహెచ్‌సీలో..

మంగపేట: మండల కేంద్రలలోని పీహెచ్‌సీలో వైద్యాధికారి వైశాలి ఆధ్వర్యంలో శ్రమదానం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ పరిధిలోని 08 సబ్‌సెంటర్ల ఏఎన్‌ఎంలు, 32 మంది ఆశ వర్కర్లు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొని పీహెచ్‌సీ ప్రాంగణంలోని పిచ్చి మొక్కలు, చెత్తను తొలగించి మొక్కలను నాటారు.



ములుగు: గ్రాస్ కటింగ్ చేయిస్తున్న ఈఓ రఘు



ఏటూరునాగారంలో..



వెంకటాపురం(కె): పిచ్చి మొక్కలను తొలగిస్తున్న కార్మికులు



వాజేడు: బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న సిబ్బంది



వెంకటాపురం(కె): స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో వైద్య సిబ్బంది



మంగపేట: పీహెచ్‌సీలో..

వాహనాల తనిఖీ



బ్యాగులను సోదాలు చేస్తున్న పోలీసులు

వాజేడు: మండల పరిధిలోని మొరుమూరు వద్ద వాజేడు, భద్రాచలం రహదారిపై ఎస్సై రుద్రారపు హరీశ్ ఆధ్వర్యంలో మంగళవారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు ప్రయాణికుల బ్యాగులను సోదాలు చేశారు. కొత్తవ్యక్తులు, అపరిచితులు, అనుమానితులు తారస పడితే సమాచారం ఇవ్వాలని వాహనదారులను ఆదేశించారు. వాహనదారులు నిబంధనలను అతిక్రమిస్తే చట్ట పరంగా చర్యలను తీసుకుంటామని హెచ్చరించారు.

ఫ్రీజర్ బహూకరణ



ఫ్రీజర్‌ను అందిస్తున్న దాతలు

ములుగు: ములుగు ప్రభుత్వ ఆస్పత్రికి రూ.75 వేల విలువగల బాడీ ఫ్రీజర్‌ను మంగళవారం పొగాకుల సునీల్‌గౌడ్-కవితల పెద్ద కుమారుడు పొగాకుల రమణ కుమార్ జ్ఞాపకార్థం బహూకరించారు. కుటుంబ సభ్యులు శోభారాణి, అనిల్, భరత్‌కుమార్, రంజిత్, అఖిల్, రవితేజ, బొమ్మగాని హైమావతి, జగదీశ్వర్, బొమ్మగాని శ్రీనివాస్, ప్రభాకర్, కృష్ణ ప్రసాద్ ఆస్పత్రిలో రమణకుమార్ జయంతి సందర్భంగా 100 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్, గైనకాలజిస్ట్ లయన్ పూజారి రఘు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మెరుగు రమేష్, ప్రధాన కార్యదర్శి లయన్ చుంచు రమేష్, కోశాధికారి రవీందర్ రెడ్డి, బలరాం రెడ్డి, సాంబశివ, శ్రీధర్ రావు, సుబ్బారెడ్డి, ఉదయ్ కిరణ్ పాల్గొన్నారు.

అకినేపల్లి మల్లారంలో పెసా గ్రామసభ



తీర్మానాలకు ఆమోదం తెలుపుతున్న గ్రామస్తులు

మంగపేట: మండలంలోని అకినేపల్లి మల్లారంలో ఎస్టీ కాలనీలో మంగళవారం పెసా గ్రామసభను పంచాయతీ కార్యదర్శి ఆమని అధ్యక్షతన నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ అభివృద్ధి పథకాల లబ్ధిదారులను పెసా గ్రామసభల ఆమోదం మేరకే ఎంపిక చేయాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఆదే విధంగా ములుగు జిల్లా పేరును సమ్మక్క-సారలమ్మ పేరుగా మార్చేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని గ్రామసభలో స్పష్టం చేస్తు తీర్మానం చేశారు. మండలంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, ఏజెన్సీలోని మంగపేట మండలంలో అక్రమ బెల్టు షాపులను రద్దు చేసి మద్యం టెండర్లు నిర్వహించాని తీర్మానించారు. గ్రామసభలో పంచాయతీ పెసా కార్యదర్శి, పెసా కమిటీ జిల్లా అధ్యక్షుడు దబ్బుల ముత్యాల రావు, గ్రామ కుల పెద్దలు, మహిళలతో పాటు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మంగపేట: వర్షాకాలంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు అప్రమత్తంగా ఉండాలని చుంచుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి చిన్నపెల్లి యమున అన్నారు. పీహెచ్‌సీలో స్పెషల్ స్వచ్ఛత డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించి పీహెచ్‌సీ పరిధిలోని ఆశవర్కర్లు, ఏఎన్‌ఎంలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి యమున మాట్లాడుతూ.. గ్రామాల్లో డ్రైడేను నిర్వహించాలని, గ్రామపంచాయతీ అధికారులు, సిబ్బంది సహకారంతో గ్రామాల్లో జనావాసాలు అంతర్గత రోడ్లు, మురుగు కాలువల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. అదే విధంగా ఇంటింటికీ ఫీవర్ సర్వే నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌ఎన్, ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యాధికారి యమున

కమలాపురంలో దొంగల హల్‌చల్



చోరీ సంఘటన వివరాలు సేకరిస్తున్న పోలీసులు

మంగపేట: మండలంలోని కమలాపురంలో గుర్తుతెలియని దొంగలు సోమవారం రాత్రి పలుచోట్ల చోరీలకు పాల్పడ్డారు. గ్రామ శివారులోని శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయ తలుపులు తాళాలు పగలగొట్టి ఆలయంలోకి చొరబడ్డారు. ఆలయంలోని హుండీని ధ్వంసం చేసి కొంత చిల్లర నగదు, నోట్లను చిందర వందరగా పడేశారు. ఉదయాన్నే ఆలయానికి వచ్చిన ఆలయ స్వీపర్‌కు ఆలయం తాళాలు పగుల గొట్టి ఉండటంతో ఆలయ నిర్వహణ కమిటీకి విషయాన్ని తెలిపాడు. వెంటనే వారు విషయాన్ని స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం తెలిసిన వెంటనే ఏటూరునాగారం సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై టీవీఆర్ సూరి సంఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించి ఆలయ కమిటీ సభ్యులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆలయానికి కొంత దూరంలోని ఎస్‌డీ అమీర్ టైర్‌వర్క్ షాప్‌లోని సామగ్రి ఉన్న పెట్టె తాళం తొలిగించి అందులోని సుమారు రూ.15,000 విలువచేసే జాకీ, వీల్‌బోల్ట్ మిషన్, స్పానర్లు, ఎత్తుకుపోయినట్లు షాపు యజమాని అమీర్ పోలీసులకు తెలిపాడు. గ్రామంలోని బిల్డ్ ఫ్యాక్టరీలో వరుస దొంగతనాలకు పాల్పడిన వ్యక్తులే ఈ చోరీకి పాల్పడి ఉంటారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

మొగుళ్లపల్లి: రైతుల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వమని, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో పీఏసీఎస్ చైర్మన్ సంపెల్లి నర్సింగారావు అధ్యక్షతన నిర్వహించిన రైతుల మహాజన సభలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. మాట్లాడుతూ.. అర్హులైన రైతులందరికీ రైతు భరోసా, రుణమాఫీ అమలు జరుగుతుందన్నారు. అ సమావేశాలల్లో పాల్గొన్న పలువురు పలు గ్రామాల రైతులు మాట్లాడుతూ.. ఐదెకరాల నుంచి పదెకరాల లోపు భూమి కలిగి ఉన్న రైతులకు మాత్రమే రైతు భరోసా పథకం అందేలా చూడాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సునీత, వ్యవసాయ అధికారులు, పాల్గొన్నారు.

కాటారం: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో ఆధ్వర్యంలో రైతు భరోసా అమలుపై ప్రజాప్రతినిధులు, రైతుల నుంచి మంగళవారం అభిప్రాయాలను సేకరించారు. పీఏసీఎస్ చైర్మన్ తోటపల్లి ప్రశాంత్ అధ్యక్షతన పీఏసీఎస్ కార్యాలయంలో ప్రత్యేక మహాజనసభ పేరిట సమావేశం నిర్వహించారు. రైతు భరోసా అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న పలు అంశాలను ఎంపీపీ పంతకాని సమ్మయ్య ఈ సమావేశంలో వివరించారు. పలువురు రైతులు తమ అభిప్రాయాలను వెల్లడించగా అధికారులు నమోదు చేసుకున్నారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ రాధిక, మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ ఉన్నారు.

ఇళ్ల స్థలాలకు పట్టాలివ్వాలి



మాట్లాడుతున్న తుమ్మల వెంకట్ రెడ్డి

గోవిందరావుపేట: ఇళ్ల స్థలాలకు పట్టాలివ్వాలని తుమ్మల వెంకట్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని పస్రా గ్రామంలో గుడిసెవాసుల ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం కడారి నాగరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా తుమ్మల వెంకట్ రెడ్డి హాజరై మాట్లాడుతూ.. ఇళ్ల స్థలాలకు పట్టాలివ్వాలని ఈ నెల 8న కలెక్టర్ కార్యాలయం ఎదుట మహాధర్నా చేస్తామని అన్నారు. పస్రా నాగారం రెవెన్యూ పరిధిలో పేదలు రెండు సంవత్సరాల నుంచి గుడిసెలు వేసుకొని జీవనం కొనసాగిస్తున్నారు. గత ఎన్నికల్లో ఎంపీ బలరాం నాయక్ పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చి పక్కా ఇళ్లు కూడా నిర్మిస్తామని హామీ ఇచ్చారని అన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వం వెంటనే గుడిసె వాసులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జూలై 8న కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాను గుడిసెవాసులకు విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పొదిళ్ల చిట్టిబాబు, గొంది రాజేష్, అంబాల పోషాలు, మల్లా రెడ్డి, పల్లపు రాజు, మురళి, రాజేశ్వరి, శారద, కవిత, అయిలయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభిప్రాయం మేరకు అమలు చేయాలి



మాట్లాడుతున్న వలియాబీ

ఏటూరునాగారం: రైతు భరోసా పథకాన్ని రైతుల అభిప్రాయం మేరకు అమలు చేయాలని జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో జనరల్ బాడీ సమావేశాన్ని ప్రజావేదిక భవనంలో ఏర్పాటు చేశారు. ఈ మేరకు వలియాబీ హాజరై మాట్లాడారు. 105 మంది రైతుల వద్ద నుంచి అభిప్రాయాలను సేకరించారన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కూనూరు అశోక్, సీఈఓ గౌరి, ఏడీఏ శ్రీధర్, ఏఓ వేణుగోపాల్ పాల్గొన్నారు.

మజీద్‌పల్లికి విద్యుత్ కష్టాలు

కాళేశ్వరం: చిన్న పాటి గాలి వీచిన, వర్షం కురిసిన కాళేశ్వరం పరిధిలోని మజీద్‌పల్లి వాడకు రాత్రివేళల్లో విద్యుత్ లేకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. మజీద్‌పల్లి వాడకు సుమారు 200లకుపైగా ఇళ్లు ఉన్నాయని సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వారు వాపోతున్నారు. ప్రతీరోజు రాత్రి సమయంలో కరంట్ లేకపోవడం నిత్యకృత్యంగా మారిందని మజీద్‌పల్లి వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం కావడంతో దోమలు, విషకీటకాల భారిన పడే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. దీంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఎన్పీడీసీఎల్ అధికారు సమస్యను తెలుసుకొని శాశ్వతంగా మరమ్మతులు, కొత్త లైన్ పునరుద్ధరణ చేయాలని పలువురు కోరుతున్నారు. కాళేశ్వరం రూరల్ ప్రాంతంలో కూడా రాత్రి సమయంలో కరంటు కోతలు పెడుతున్నారు. కాగా, ప్రస్తుతం ఎన్పీడీసీఎల్ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



మండల సభలో పాల్గొన్న అధికారులు

ఎస్‌ఎస్‌తాడ్వాయి: మండల అభివృద్ధిలో ప్రతి ఒకరూ భాగస్వాములు కావాలని ఎంపీపీ గొంది వాణిశ్రీ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా అధికారులు అభివృద్ధి పనుల నివేదికలను చదివి వినిపించారు. తహసీల్దార్ రవీందర్ మాట్లాడుతూ.. వర్షకాలాన్ని దృష్టిలో పెట్టుకుని మండలంలోని రోడ్డు సౌకర్యం లేని మారుమూల గ్రామాలైన బోల్లెపల్లి, బందాల గిరిజన గ్రామాలకు నాలుగు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యం పంపించామన్నారు. ఏఈఓ పోరిక జైసింగ్ వ్యవసాయశాఖ పనులను వివరించారు. పంటలు సాగు చేస్తున్న రైతులు పంట ఇన్సూరెన్స్ తప్పకుండా చేయించుకోవాలన్నారు. ఆర్‌ఓఎఫ్‌ఆర్ భూముల్లో పంటలు సాగు చేయకుండా అటవీశాఖ అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో పంట విస్తీర్ణం కొంత మేరకు తగ్గుతుందని సభలో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇంటి అవసరాలకు ఇసుక, రాయి కూడా తెచ్చుకోకుండా అటవీధికారులు అడ్డుపడుతున్నారని కోఆప్షన్ మెంబర్ దిలావర్ ఖాన్ అధికారులకు తెలిపారు. సీడీపీఓ మల్లేశ్వరీ మాట్లాడుతూ.. ఈసారి అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు ప్రభుత్వం యూనిఫాం అందించిందని, వారంలోగా దుస్తులు కుట్టించి పిల్లలకు పంపిణీ చేస్తామన్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ, మండల స్పెషలాఫీసర్ అల్లెం అప్పయ్య మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్య పనులపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం నేటితో ఎంపీపీ, ఎంపీటీసీల పదవికాలం ముగిస్తుడడంతో ఎంపీపీ వాణిశ్రీ, ఎంపీటీసీలు ఇర్సవడ్ల భవాని, మేడిశెట్టి జయమ్మ, నాలి సుమలత, కోఆప్షన్ సభ్యుడు దిలవార్‌ఖాన్‌లను అధికారులు శాలువాలతో సన్మానించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. ఐదేళ్ల కాలంలో మండలంలోని అభివృద్ధితోపాటు సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేశానని అన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ సుమనవాణి, ఇరిగేషన్‌శాఖ డీఈ సదయ్య, ఎంపీఓ శ్రీధర్, మిషన్ భగీరథ ఏఈ నవీన్, ట్రాన్స్‌కో ఏఈ వేణుకుమార్, మండల నోడల్ అధికారి రేగ కేశవరావు, వైద్యాధికారులు రణదీర్, రంజీత్, అధికారులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో భద్రత



మాట్లాడుతున్న ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి

ఎస్‌ఎస్‌తాడ్వాయి: గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో ప్రజలకు భద్రత ఉంటుందని ఎస్సై శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని రంగాపూర్, బీరెల్లి గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుపై గ్రామస్తులతో ఎస్సై సమావేశమై మాట్లాడారు. సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకోవడం వలన భద్రతకు భరోసా ఉంటుందన్నారు. గ్రామాల్లో నేరాలు, దొంగతనాలను నివారించవచ్చన్నారు. రాత్రి సమయంలో గ్రామంలో సంచరించే కొత్త వ్యక్తులను గుర్తించవచ్చన్నారు. కమిటీలను ఏర్పాటు చేసుకుని కమిటీల ఆధ్వర్యంలో కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని పోలీసుల సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కమిటీ ద్వారా గ్రామాల్లో విరాళలు సేకరించాలన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు కోసం ముందుగా రంగాపూర్, బీరెల్లిలో కమిటీలకు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి రూ.4వేలు, హెడ్‌కానిస్టేబుళ్లు, గ్రామ పోలీసు అధికారులు పూర్ణ, వెంకన్నలు ఇద్దరు కలిసి రూ.2వేలు అందజేశారు. అనంతరం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.